

# బహుమతి

...—చిన్నమ్మాయి

ఉమా....ఉమా...

టీషర్ట్స్ చూస్తున్న నేను ఉలిక్కి పడి తలతిప్పాను.

'కమల'

"ఓష్...ఎన్ని సంవత్సరాల తర్వాత.." అంటూ కమల చేతిని అందుకొన్నాను ఆనందంగా.

"అబ్బా...నువ్వేమి మారలేదు ఉమా పది సంవత్సరాల తర్వాత చూస్తున్నా 'అప్పటి' ఉమ లానే ఉన్నావ్" నావైపు పరీక్షగా చూస్తున్నా కమల కళ్ళలో దాచినా దాగని ఈర్ష్య ఒక్క నిమిషం తొంగి చూసింది.

గర్వంతో కూడిన చిరునవ్వు నా పెదవుల పై వర్తించింది కొద్దిసేపు.

"సుధీర్ ఏం చేస్తున్నాడు? ఆమధ్య మెడిసన్‌లో చేర్పించావని విన్నాను" అన్న కమల మాటలకు "అవును ఇప్పుడు సెకండ్ ఇయర్ చేస్తున్నాడు. అన్నయ్య గారు పిల్లలు బాగున్నారా? పద ఇంటికెళ్దాం..దగ్గరే" అంటూ బిల్ చెల్లించి బయటికి నడిచాను.

"ఇప్పుడు కాదులే రేపు సాయంత్రం వస్తాను నీవు ఎక్కడవుండేది అడ్రస్ ఇవ్వు "అంటూ ఒక నిమిషం నా సమాధానం కోసం ఆగింది.

"ఆ..మర్చిపోయా రేపు సుధీర్ బర్త్‌డే. తన ఫ్రెండ్స్‌కి, నాకు తెలిసిన వాళ్ళకు అందరికీ 'సరోవర్'లో రేపు సాయంత్రం 6 గం. పార్టీ ఇస్తున్నాడు. నీవు తప్పకరావాలి. అక్కడ్నించి ఇంటికి రావాలి సరేనా..?"

'ఓ.కే. అలాగే చేద్దాం..బై.బై. అంటూ అక్కడే పార్క్ చేసి వున్న కారువైపు నడిచింది కమల.

కమల మేము విజయవాడలో ప్రక్కప్రక్క ఇళ్ళలో వుండే వాళ్ళం. కమల భర్తకి హైద్రాబాద్‌లో కాంట్రాక్ట్ వర్క్ రావటంతో ఫామిలి అంతా ఐదు సంవత్సరాల క్రితం వచ్చేశారు. బాగా సంపాదించినట్టున్నారు. కార్ మెయిన్‌టెన్ చేయటమంటే వ్యవహారాలు లక్షలు దాటి వుండాలి.

బరువుగా నిట్టూరుస్తు ఆటోలో ఇంటి కొచ్చి అలసటగా బెడ్‌మీద వాలాను. ఈ రోజెందుకో సుధీర్ ఇంకా కాలేజీ నుంచి రాలేదు. ఆలోచనలు గతంలోకి పరుగెత్తుతున్నాయి కళ్ళెంలేని గుర్రంలా. ఆరోజుల్లో సుధీర్ వాళ్ళడాడీ కమల.వాళ్ళాయన నలుగురం కలిసి సరదాగా

తిరగని చోటు లేదు. శ్రీరాం స్కూటర్ యాక్సిడెంట్‌లో మరణించటం వలన నాకు అతను చేసే జాబ్ అయితే దక్కింది కానీ ఒంటరి దాన్నయ్యాను. అప్పట్నుంచే లైఫ్ రొటీన్‌గా మారింది. నో చేంజ్! ఎనీహౌ..సుధీర్‌కి తండ్రి లేని లోటు తెలియ కుండా పెంచగలిగాను. భర్తతోడు లేని భార్య పడాల్సిన ఇబ్బందులన్నీ తను పడింది. తన అందం తన కే శతృవయింది కొన్ని సార్లు. మరికొన్ని సార్లు ఈ అందం, ఈ హొయలుతోనే తన హద్దులు దాటక ప్రమోషన్స్ కొట్టిన సందర్భాలు లేక పోలేదు అప్రయత్నంగా ఎదుటనున్న నిలువు టద్దంలోకి చూశాను నా ప్రతి బింబం చూసి నాకు నేను మురిసి పోవటం వంటరిగా ఉన్నప్పుడు ఒక 'హాబీ'గా తయారయ్యింది. స్లీవ్‌లెస్ బ్లవుజ్ లోంచి తొంగి చూసే గుండ్రని భుజాలు, ఆఫ్‌స్టిల్ కొద్దిగా పోయినా మెరుపు పోని పెదాలు, నలభైకి దగ్గరవుతున్నా వడలని శరీరం నుదిట మీద ఎర్రటి బొట్టు...ఈ విషయంలో తను ఎన్నిసార్లు విమర్శలకు గురయింది. కానీ తనేమీ లెక్క చేయలేదు.

> భర్తతోడులేని భార్య పడాల్సిన ఇబ్బందులన్నీ తనుపడింది. తన అందం తనకే శతృవయింది కొన్నిసార్లు, మరికొన్నిసార్లు ఈ అందం, ఈ హొయలుతో తన హద్దులుదాటక ప్రమోషన్స్‌కొట్టిన సందర్భాలూలేకపోలేదు.

బజర్ అదే పనిగా మోగటంతో ఉలిక్కి పడి లేచాను బహుశా సుధీర్ అయ్యుంటాడు "ఏమిటి మమ్మీ ఏం చేస్తున్నావ్? ఇందాకట్నించీ బజర్ నొక్కుతున్నాను" సోఫాలో కూర్చుని షూష్ విప్పుకుంటూ అన్నాడు సుధీర్.

"ఇప్పుడే బజారు కెళ్ళివచ్చాను. నీ బర్త్‌డే డ్రస్ తెచ్చాను చూడు ఎలా వున్నాయ్" అంటూ కిచెన్ వైపు కదిలాను కాఫీ కలప టానికి.

"చాలా షాపింగ్ చేసినట్లున్నావే. మమ్మీ టీషర్ట్ చాలా బావుంది కానీ స్నఫ్ కలర్ జీన్స్ అయితే బాగుండేది దీనిమీదకు పోనీలే ఇదీ బావుంది. అవునూ...ఈ ప్యాకెట్‌లో ఏమిటి?" కాఫీ కప్ తెస్తున్న నేను ఒక్క నిమిషం డోర్‌వద్దే ఆగాను. సుధీర్ దీక్షగా చూస్తున్నాడు. ఆ ప్యాకెట్‌లో నా కోసం తెచ్చుకొన్న రెండు షిఫాన్ శారీస్, బ్రాసియర్స్, లిప్‌స్టిక్, చీక్ రోజ్ కలర్, నైల్‌పాలిష్. "అవన్నీ నా టాయలెట్ సామాను..ఇదిగో కాఫీ తీసుకో" అంటూ చేతికి అందిచాను కప్.

మౌనంగా నావైపు చూసి తన బెడ్‌రూమ్‌లో కెళ్ళాడు సుధీర్.

*　　　*　　　*

స్టీరియోలోంచి　　వస్తున　　రమ్యమైన



సుప్రభాతానికి మెలుకువ వచ్చింది. సుధీర్ నా కంటె ముందే లేచినట్లున్నాడు. అరే..టైము 7.గం. కావస్తోంది చివాలున లేచి నైట్‌గౌన్ సరిచేసుకుంటున్న నాదృష్టి ప్రక్కనే టీ పాయ్ మీదున్న ప్యాకెట్, చిన్న లెటర్ మీద పడింది. సుధీర్ చేతి వ్రాత..ఏమైవుంటుంది ఈ రోజు సుధీర్ బర్త్‌డే కదా అందువలన ఏదయినా తను నాకు డైరెక్ట్‌గా చెప్పలేని కోర్కె ఏదయినా..

"మమ్మీ,

ఈ రోజు నేను ఏ దడిగినా కాదనక నా కోర్కె తీర్చటం నీకు సంతోషం కదూ? అందుకే నిన్ను ఏకొడుకు తన తల్లిని అడగలేని కోర్కె కోరబోతున్నాను.

అమ్మా! నీకు గుర్తుందా? నా చిన్న తనంలో మమ్మీ అని పిలవమని నీవు ఎంత చెప్పినా వినక అమ్మా అని పిలిస్తే నా చేతి మీద వాత పెట్టావు. నాకు మొదట్నించి నిన్ను అమ్మా అనిపిలవాలని ఒక తల్లిగా నీవు నాకు అనురాగాన్ని పంచు తావని ఇలాంటి ఆలోచనలతో వుండేవాడిని. కానీ నీవు డాడీ చనిపోయిన తర్వాత మరీ ఎక్కువగా ఎంత సేపూ డబ్బు సంపాదన, సొసైటీలో సోకాల్డ్ లేడీ గా తిరగాలను కోవటం అప్‌టుడేట్ ఫ్యాషన్ బుల్‌గా తయారవటం నీకు హాబీలుగా మారాయి.

నీ సంతోషం కోసం ఫ్రెండ్స్ అందరికీ నా బర్త్‌డే పార్టీ యివ్వటం జరుగుతోంది. కానీ పార్టీలో ప్రతి వాళ్ళు నీ అలంకరణ చూసి (బాగా తెలిసిన వాళ్ళు తప్ప) ఆమె ఫ్రెండా..సిస్టరా..లేక మరో వరుసో పెట్టి అడుగు తుంటే..నా స్థానంలో నీవుంటే'నా బాధ కొంతయినా నీ కర్థం అయ్యేది. కానీ ఒక్కసారన్నా ఆలోచించావా?....నీకు ఇరవై ఏళ్ళ వయసున్న కొడు కున్నాడనీ డాడీ చని పోయారని (అలా అని నేను భర్త లేక పోతే అలంకరణలు వద్దని కాదు కానీ వయసు సొసైటీ గుర్తు పెట్టుకోవాలి) వయసుకు తగ్గ కట్టు బొట్టు వుండాలమ్మా.

అమ్మా...ఈ రోజు నుంచి నాకు నచ్చే విధంగా మనచుట్టూ వున్న మనవాళ్ళు మెచ్చే విధంగా నీవు ప్రవర్తించాలని నా చేతితో ఇచ్చే మొదటి బహుమతి (నా సంతోషం కోసం) స్వీకరించాలని కోరుతూ...

నీ ప్రియ తనయ.

శరీరంలోని రక్తమంతా గుండెలోకి చేరి బరువెక్కినంత బాధ అప్రయత్నంగా ప్యాకెట్ విప్పి చూశాను. ఎర్రబోర్డరున్న తెల్లని జరీ చీర.

*